
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 16 నవంబరు 2024











అమనగల్లు కన్యకాపరమేశ్వరి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పుప్పాలగూడ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు





మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో..



యాచారం మండలం నందివనపర్తి జ్ఞానసరస్వతీ ఆలయంలో..

దేదీప్యమానం

కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దీపపు వత్తులు వెలిగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే దేవాలయాల్లో భక్తుల కోసం అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల్లో పరిసరాలను పర్యవేక్షించారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

» రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



మొయినాబాద్ మండలంలో సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆకునూరి మురళి

మొయినాబాద్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. శుక్రవారం మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్స్ అడిగే ప్రశ్నలకు ప్రజల నుంచి వస్తున్న సమాధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గిరిజన సాధికారతకు పెద్దపీట

» ఎమ్మెల్యే కసిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

కడ్తాల్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. సంపూర్ణ గిరిజనాభివృద్ధి కోసం అమలు చేస్తున్న ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోవాలని ఆయన పిలుపు నిచ్చారు. కడ్తాల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం అమలులో భాగంగా గిరిజనులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా సమావేశమయ్యారు. దేశంలో గిరిజనుల జీవన ప్రమాణాల పెంపు, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రూ.79,156 కోట్లతో అమలు చేస్తున్న దర్తీ ఆబా కార్యక్రమంలో పథకాల ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వర్చువల్‌గా మోదీ వివరించారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన మైసిగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామేశ్వరి దేవి, పథకం ప్రత్యేకాధికారి గీత, ఏటీడీవో వెంకటయ్య, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ్మా, చేగూరి వెంకటేశ్, హన్మనాయక్ పాల్గొన్నారు.

అటెండర్లే దిక్కు

అధ్వానంగా గ్రామీణ ప్రాంత గ్రంథాలయాలు
కొరవడిన మౌలిక సదుపాయాలు
శిథిలావస్థకు చేరిన భవనాలు
భయం గుప్పిట్లో పాఠకులు

లైబ్రరీల్లో గ్రంథపాలకుల పోస్టులు ఖాళీ

విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాల నిర్వహణకు అటెండర్లే దిక్కయ్యారు. జిల్లాలోని అనేక లైబ్రరీల్లో గ్రంథపాలకుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో నిర్వహణ బాధ్యత చూసేవారులేక గ్రంథాలయాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస వసతులు లేక పాఠకులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజ్ఞానాన్ని పంచే పీటని ఆధునీకీకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను పట్టించుకునేవారే లేరు. అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేక కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. చాలాచోట్ల గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భయం గుప్పిట్లో పుస్తక పఠనం సాగిస్తున్నారు.



శిథిలావస్థలో ఉన్న చేవెళ్ల గ్రంథాలయం

రంగారెడ్డి అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 24 గ్రంథాలయాలు ఉండగా.. మొత్తం 3.20 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయం బడంగ్‌పేట్‌లో కొనసాగుతోంది. 24 గ్రంథాలయాలకు గాను 16 మంది గ్రంథపాలకులు మాత్రమే ఉన్నారు. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఒక్కో గ్రంథ పాలకుడు రెండు నుంచి మూడు గ్రంథాలయాల నిర్వహణ బాధ్యత చూసుకుంటున్నారు. కొన్ని చోట్ల అటెండర్లే నిర్వహణ బాధ్యత

మిగతా 8వ పేజీలో...

పేరుకుపోయిన సెస్ బకాయిలు

జిల్లాలోని గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు ఏటా వసూలు చేసే ఆస్తి పనుల్లో 8శాతం గ్రంథాలయ సెస్‌ను చెల్లించాల్సి ఉంది. ఈ నిధులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఖాతాలో జమ చేయాలి. యేటా ఈ ప్రక్రియ వంద శాతం జరగకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో రూ.4 కోట్ల సెస్ వసూలు కావాల్సి ఉంది. ఈ ఫండ్‌తోనే దిన, వార, మాస పత్రికలు, కుర్చీలు, టేబుళ్లు, అట్టలు, తాత్కాలిక ఉద్యోగుల జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తుంటారు. సకాలంలో సెస్ వసూలు కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అభివృద్ధి పనులు, మరమ్మతులు, శాశ్వత భవనాలు, గదుల నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న సామ మాణిక్యరెడ్డి

బీఎస్ఎన్ఎల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా..

చేవెళ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవుని ఎర్రవల్లి గ్రామం మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డిని బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నామినేటెడ్ పదవి వరించింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో మాణిక్యరెడ్డి నియమాక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, నాయకులు ప్రభాకర్, దేవుని శర్వలింగం, శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

కందుకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మండల ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ కోరారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 4వ తేదీన తమ సంఘ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కానీ నేటికీ ఏ ఒక్క రైతుల ధాన్యాన్ని తీసుకురాలేదన్నారు. దళారులకు ధాన్యం అమ్ముకొని మోసపోవద్దని సూచించారు.



బుగ్గజాతరకు పోటెత్తిన భక్తులు

బుగ్గక్షేత్రం.. భక్త జనసంద్రం

» శివనామస్మరణతో మార్మోగిన ఆలయం
» కార్తీక స్నానాలు ఆచరించిన భక్తులు

మంచాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం దక్షిణకాశీగా పిలువబడే బుగ్గరామలింగేశ్వర క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి ప్రారంభమైంది. పుష్కరిణిలో కార్తీకస్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ప్రమిదలు వెలిగించి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం బుగ్గక్షేత్రాన్ని సందర్శించి పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. రూ.6 లక్షల నిధులతో చేపట్టిన షెడ్డును ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. బుగ్గజాతరలో భక్తులకు ఇబ్బంది కలగకుండా వసతి కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

శిథిలావస్థలో షాదీఖానా!

8

రూ.50లక్షలతో భవన నిర్మాణం
ఒకప్పుడు జోరుగా ఫంక్షన్లు..
నిర్వహణ లేక నేడు నిరుపయోగం
పిచ్చిమొక్కలు పెరిగి అధ్వాన స్థితికి..



నాటడం ఎందుకు.. నరకడం ఎందుకు?

విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని చెట్ల కొమ్మల నరికివేత
నాటే ముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిందని యాచారం మండల ప్రజల ఆగ్రహం

6



దండాలు మైసమ్మ తల్లో..

మైసిగండిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
ఉత్సవాలను ప్రారంభించిన ఆలయ ఫౌండర్‌ట్రస్టీ సిరోలిపంతూ
ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాధవి దంపతులు

కడ్తాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక పౌర్ణమి మొదలు కార్తీక శష్టి వరకు ఆరు రోజుల పాటు కనుల పండువగా ఉత్సవాలు కొనసాగుతాయి. ఇందులో భాగంగా వేదపండితులు సుప్రభాత సేవతో మైసమ్మ అమ్మవారికి మేలుకొల్పు పాడారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి స్నేహలతతో కలిసి ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ అమ్మ వారికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు సమర్పించారు. అమ్మవారి కలశంతో మేళతాళాలతో ఆలయ ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి కార్యక్రమాలు నిర్వహించారు. కుంభహారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్‌నాయక్, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికారప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, తులసీరామ్‌నాయక్, శేఖర్‌గౌడ్, హన్మనాయక్, రామావత్ భాస్కర్, చాట్ల లింగప్ప, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆర్.పి.జ్యోతి అరుణ్ పాల్గొన్నారు.



కుంభహారతిలో పాల్గొన్న భక్తులు

అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనుమతులు పొందకుండా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు తీసుకోవాలని తాండూరు మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోక పోవడంపై హైకోర్టు న్యాయమూర్తి కమిషనర్‌ను ప్రశ్నిస్తూనే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి ఆర్డర్‌ను పాస్ చేశారు. తాండూరు పట్టణం శివాజీచౌక్‌లోని మల్‌రెడ్డిపల్లి మార్గంలో భారీషాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఆ అక్రమ నిర్మాణంపై కౌన్సిలర్ శ్రీలత అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేక పోవడంతో


తాండూరు శివాజీ చౌక్‌లో నిర్మించిన దుకాణాల సముదాయం

ఆమె హైకోర్టులో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని పిటిషన్ వేశారు. నిర్మాణదారులను పార్టీ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 4న హైకోర్టు వెలువరించిన తీర్పును కౌన్సిలర్ శ్రీలత మీడియాకు తెలియజేశారు. నాలుగు వారాల వ్యవధిలో ఈ ఆర్డర్‌ను అమలు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా హైకోర్టు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చిందని కౌన్సిలర్ సాహు శ్రీలత తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాటడం నరకడం ఎందుకు?

రోడ్డుపక్కన ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలు నరికివేత

యాచారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా ట్రాన్స్‌కో అధికారులు చెట్ల కొమ్మలు నరికి వేయిస్తున్నారు. ఐదేళ్ల క్రితం విద్యుత్ వైర్ల కింద ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అవి నేడు ఏపుగా పెరిగి నీడ నిస్తున్నాయి. ఈక్రమంలో గురువారం మండల కేంద్రంలోని హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలన్నింటినీ అధికారులు నరికివేయించారు. మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహం వెనకాల ఉన్న చెట్లకొమ్మలను నరికి చేతులు దులుపుకున్నారు. కొమ్మలు విగ్రహంపై పడి ఉన్నాయి. శుక్రవారం కూడా వాటిని తీయించలేకపోయారు. చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఎల్టీ 11 కేవీ విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలన్నింటినీ నరికివేయించారు. మొక్కలు నాటిన పిదప నరకడమెందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


గాంధీజీ విగ్రహం వద్ద చెట్లకొమ్మలు నరికి చేతులు దులుపుకున్న అధికారులు


యాచారంలో చెట్ల కొమ్మలను నరికి వేయించిన అధికారులు

'సర్వే' విధులకు గైర్హాజరైన టీచర్లపై చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వే విధులకు గైర్హాజరు కావడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కటికెల శ్రీహరి ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 10న ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి.. కేటాయించిన గ్రామాల్లో సర్వే చేయకుండా గైర్హాజరైన ఏడుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు శ్రీహరి తెలిపారు.

ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

- అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్


ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, భూములు కోల్పోయిన ప్రతీ రైతుకు తగిన న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం జెన్నాయిగూడ, రావిరాల గ్రామాల రైతులు తుక్కుగూడలోని కేఎల్లార్ కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాబ్‌సిటీ కోసం దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కొందరు రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి భూనిర్వాసితులకు తగిన పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వాలు ముందుకు రాలేదన్నారు. 2022లో టీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక నాయకుల సమక్షంలో ఫ్యాబ్‌సిటీ రైతులకు లే అవుట్ చేసి ప్లాట్లు ఇస్తామని చెప్పగా.. పలు కారణాల చేత సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ముందుకు వస్తుందని, భూములు కోల్పోయిన ప్రతీ రైతు కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా తాను బాధ్యత తీసుకుంటానన్నారు. కాస్తుదారులకు ఎకరాకు 150 గజాలు, సీలింగ్ పట్టాదారులకు 250 గజాలు, 38 ఈ పట్టాదారులకు ఎకరానికి 600 వందల గజాల చొప్పున ప్లాట్లు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని జెన్నాయిగూడ భూ నిర్వాసితులకు కేఎల్లార్ హామీ ఇచ్చారు. పాండు రంగారెడ్డి, నర్సింహ, మాధవరెడ్డి, యాదయ్య, భిక్షపతి, శ్రీశైలం, లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఎండీ అన్నపూర్ణ

ఇబ్రహీంపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు బలోపేతమైనప్పుడే ప్రజలకు చేరువ అవుతాయని.. ఈ దిశగా కృషి జరగాల్సి ఉందని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఎండీ అన్నపూర్ణ అన్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉప్పరిగూడ ప్యాక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇప్పటికే సహకార సంఘాల ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు ఇస్తున్నామని.. పంట రుణాలు, బంగారంపై రుణాలు అందిస్తున్నామన్నారు. సంఘాల్లో డిపాజిట్లను పెంచుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఫ్యాకల్టీ) సురేఖ, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాచకొండ మైలారం, మంచాల, యాచారం ప్యాక్స్ చైర్మన్లు బిట్ల వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సీవో బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి ఆటలేమాయె!

- కనుమరుగైన బొంగరం, గిల్లిదండ, గోటీలు
- నేడు నాలుగు గోడల మధ్యనే పిల్లల ఆటలు
- ఫోన్లు, కంప్యూటర్లకే అతుక్కుపోతున్న బాల్యం
- పాఠశాలల్లోనూ తగ్గిన గేమ్స్
- అనారోగ్యం పాలవుతున్న పిల్లలు



కోతికొమ్మచ్చి ఆడుతున్న బాలురు

తాండూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ ఆటలకు కాలం చెల్లింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నారులు సెల్‌ఫోన్లకే పరిమితమవుతున్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సెల్‌ఫోన్ల వినియోగం పిల్లలపై ప్రభావం చూపిస్తోంది. మైదానాలకు వెళ్లి ఆడే ఆటల కంటే ఇంట్లో కూర్చుని ఆడే ఆటలపైనే చిన్నారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు పల్లెల్లో కనిపించిన బొంగరం, గోటీలు, కోతి కొమ్మచ్చి, దాగుడు మూతలు, అష్టాచమ్మా వంటి ఆటలు ఇప్పటి కాలం పిల్లలకు తెలియవంటే నమ్మశక్యం కాదు. ప్రస్తుతం పిల్లలు ఖరీదైన, ఆధునిక ఆటలవైపే మొగ్గు చూపుతున్నారు. ఫోన్, వీడియోగేమ్, కంప్యూటర్‌లోని ఆటలు, కార్‌రేస్, స్నూకర్, క్రికెట్, బాక్సింగ్, ఫైరింగ్ తదితర ఆటలవైపు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు పాతకాలం ఆట వస్తువుల తయారీ ఆధారపడిన చేతివృత్తుల వారు ఉపాధి కోల్పోతున్నారు. ఏదిఏమైనా బాలల మానసిక వికాసానికి తోడ్పడే సంప్రదాయ ఆటలు కనుమరుగు అవడం విచారకరమని పలువురు అంటున్నారు.

సంప్రదాయ ఆటవస్తువులు కనుమరుగు

సంప్రదాయ ఆట వస్తువులైతే పూర్తిగా కనుమరుగవుతున్నాయి. పిల్లల ఆటవస్తువులన్నీ దాదాపు ప్లాస్టిక్‌తో తయారవుతున్నాయి. దీంతో అలనాటి ఆటల ఉనికి కనుమరుగవుతోంది. బొంగరం, ఇసురాయి, గంగిరెద్దు, గిల్లిదండ, గోటీలు, కట్టె కుర్చీలు తదితర వంటి పల్లె వాతావరణాన్ని తలపించే ఆట వస్తువులు కనిపించకుండా పోతున్నాయి. వాటిస్థానంలో ఆధునిక పరికరాలు తిష్టవేశాయి. ఇంకొన్ని రోజులు గడిస్తే వీటిని మ్యూజియంలో చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటే ఆశ్చర్యం కలగక మానదు. గ్రామాల్లో కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేతరి తదితరులు తయారు చేసే బొంగరాలు, గిల్లిదండలు, కస్తం, కట్టె కుర్చీలు, నులక మంచాలు, తదితరాలు ప్రస్తుతం చూద్దామన్నా కనిపించడం లేదు. ఒకప్పుడు వీటి కోసం గంటల తరబడి వేచిఉండి తయారు చేయించుకుని ఆటలాడుకునేవారు.



గిల్లి గోనె ఆడుతున్న చిన్నారులు



గోటీలు ఆడుతున్న చిన్నారి

రోజూ ఆటలు ఆడించాలి



పాఠశాలలో ఆటలు ఆడించడంలేదు. సెల్‌ఫోన్లలోనే గేమ్స్ ఆడుకుంటున్నాం. ప్రతిభ ఉన్నవారు కూడా ఆటలకు దూరం అవుతున్నారు. పాఠశాలలో గ్రౌండ్‌లో రోజూ ఆటలు ఆడిస్తే బాగుంటుంది.

- అరవింద్‌గౌడ్, 10వ తరగతి విద్యార్థి, తెలంగాణ మోడల్ స్కూల్, జినుగుర్తి

నేటి విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు



నేటి విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. సెల్‌ఫోన్లకు పరిమితమై ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నా రు. శారీరకంగా, మానసికంగానే కా కుండా తినే ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదు. విద్యార్థుల శారీకంగా, మానసికంగా ధృడంగా ఉండాలంటే క్రీడలో చాలా అవసరం.

- యాదగిరి, ఫిజికల్ డైరెక్టర్, తెలంగాణ మోడల్ స్కూల్ జినుగుర్తి

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

కందుకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషా నరహరి భవనంలో సీపీఎం జిల్లా నాయకులు డి.రాంచందర్, పి.అంజయ్యల అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నూతనంగా తెచ్చిన రైతు కార్మిక చట్టాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ రైతుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, రైతు సంఘం కార్యదర్శి బి.మధుసుదన్‌రెడ్డిలు మాట్లాడుతూ కేంద్రం 56 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ల పేరుతో కార్మికులు సమస్యలపై కనీసం సమ్మెచేసే హక్కు లేకుండా చేశారని ఆరోపించారు. ఈనెల 18న మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, రైతు సంఘం నేతలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ కవిత, జిల్లా నాయకులు కీసరి నర్సిరెడ్డి, రైతు సంఘం నాయకులు ఎ.కుమార్, బి.శ్రీనివాస్, బుట్టి బాల్‌రాజ్, స్వప్న, నర్సింహ, బుగ్గరాములు, ఎల్లేష్, తావ్యనాయక్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాలను పూర్తి చేసి, మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, రాష్ట్రంలో పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని, దానికి సాక్ష్యం లోక్‌సభ ఎన్నికల ఫలితాలేనని వివరించారు. బీజేపీ సభ్యత్వాలను తీసుకోవడానికి ప్రతీఒక్కరు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. ఈనెలాఖరులోపు సభ్యత్వాలను పూర్తిచేసి, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలో సైతం మున్సిపల్ కౌన్సిలర్లుగా గెలువడానికి మంచి అవకాశం ఉందని, అన్ని వార్డుల్లో పోటీ చేసి, విజయం సాధించడానికి సన్నద్ధమై సానుకూల వాతావరణాన్ని కల్పించుకోవాలని కోరారు. పట్టణ శాఖ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, అండాపురం నర్సింహగౌడ్, ప్యాట అశోక్, ఇస్నాతి శ్రీనివాస్, చెట్ల వెంకటేష్, మోహన్‌సింగ్, బాల్‌రెడ్డి, నర్సింహ, శివ శంకర్, ప్రవీణ్, బాల్‌రాజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంధనలో శుక్రవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధర్‌రెడ్డిలు వేర్వేరుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి కృపకు అందరు పాత్రులు కావాలని వారు అకాంక్షించారు. గ్రామ మాజీ సర్పంచ్ మధుసూదన్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, పాపిరెడ్డగూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, నాగిళ్ల కృష్ణయ్య, ప్రతాప్, రామస్వామి, నాగిళ్ల వెంకటేష్, రాంరెడ్డి, అంజనేయులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, రాజేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, రమేష్, కొడూరు రాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు నలుగురు హైడ్రా వలంటీర్లు



మేడ్చల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ జాతీయ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించటానికి ట్రాఫిక్ పోలీసులతో పాటు అదనంగా నలుగురు హైడ్రా వాలంటీర్లను నియమించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ట్రా'ఫికర్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య నయంత్రణకు కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నలుగురు హైడ్రా వలంటీర్లను నియమించారు. ప్రస్తుతం ఇద్దరు వలంటీర్లు విధుల్లో చేరగా మరో ఇద్దరు చేరాల్సి ఉంది. పట్టణంలోని పెద్దచెరువు కాలువ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు వాహనాల రద్దీ ఏర్పడకుండా నలుగురు విధులు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాల నియంత్రణ, రోడ్డు పక్కన పార్కింగ్‌లను నియంత్రించటంతో పాటు, రోడ్డు మధ్య వాహనాలు బ్రేక్ డౌన్ అయితే వెంటనే అక్కడికి చేరి ట్రాఫిక్ తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు. రోడ్డు పనులు ముగిసేవరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తెలిపారు.

జాతర స్టాల్స్ హిందువులకే కేటాయించాలి



మాట్లాడుతున్న భగరంగ్ ధళ్ తెలంగాణ ప్రముఖ్ శివరాములు

వికారాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే జాతరలో స్టాల్స్ హిందువులకే కేటాయించాలని భజరంగ్ ధళ్ తెలంగాణ ప్రముఖ్ శివరాములు అన్నారు. అనంతగిరికి శుక్రవారం వచ్చిన ఆయన ఆలయ ఈవో, ట్రస్టిలతో మాట్లాడారు. అనంతరం అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా వేదికలో ప్రసంగించారు. హిందువులకు అన్యాయం జరిగితే ఊరుకోమన్నారు. స్టాల్స్ హిందువులకే కేటాయించాలని, లేదంటే ఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సౌకర్యాలు సమకూర్చడంలో ఆలయ ఈవో విఫలమయ్యారని విమర్శించారు. పుష్కరిణిని బాగు చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

రైతుల భూములను బలవంతంగా సేకరించొద్దు

కొడంగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పేరుతో రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా సేకరించొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య అన్నారు. వారు కొడంగల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలే అధికారులపై జరిగిన దాడికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే దాడి జరిగిందని ఆరోపించారు. పేద రైతుల భూములను తీసుకోకుండా కొడంగల్ ప్రాంతంలో ఉన్న 1156 ప్రభుత్వ భూములను సేకరించి ఫార్మా ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అనిల్, జయప్ప, భీమేశ్, అంజి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

వికారాబాద్: లగచర్లలో జిల్లా ఉన్నతాధికారులపై దాడి ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, బి.మల్లేశ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆరు ఏడు నెలలుగా ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని పలు దఫాలుగా అక్కడున్న రైతులు శాంతియుత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారి అభ్యంతరాలను వినకుండా రైతులను భయభ్రాంతులకు గురి చేసి అక్రమంగా భూములు లాక్కోవాలని చూస్తోందన్నారు. నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములు కాకుండా అదే కొడంగల్ ప్రాంతంలో వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరు: దుద్యాల మండలం లగచర్ల ఘటనపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల భూములను బల్వంతంగా సేకరించడం తగదన్నారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే కొడంగల్‌లో ఉన్న 1154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని సేకరించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే అధికారులపై దాడి జరిగిందన్నారు. ఒకవైపు కలెక్టర్ తనపై దాడి జరగలేదని సామాజిక బాధ్యతతో స్వయంగా ప్రకటించినా ప్రభుత్వం, పోలీస్ అధికారులు గిరిజనులు, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అమాయక రైతులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కొడంగల్, బొంరాస్‌పేట్ మండలంలో ఇంటర్నెట్ కట్ చేసి ఆ గ్రామాల ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కును కాలరాశారని పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న రైతులను సంఘటితం చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు వాలీబాల్ పోటీలు

శంషాబాద్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు(శనివారం) శంషాబాద్ మండల పరిధిలోని పెద్దతూప్రలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 16వ ఈషా గ్రామోత్సవంలో భాగంగా నిర్వహించే వాలీబాల్ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నీలో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

అధికారులపై దాడి అమానుషం



మాట్లాడుతున్న సుమన్

చౌదరిగూడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లగచర్లలో భూ సేకరణ విషయమై జరిగిన దాడిలో రైతుల ముసుగులో బీఆర్ఎస్ నాయకులు అధికారులపై దాడి చేయడం అమానుషమని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు సుమన్ ఆరోపించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరితమైన చర్యలతోనే అధికారులపై దాడి చేశారని అన్నారు. ఈ దాడి వెనక మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై బీఆర్ఎస్ గుండాలు దాడిచేయడం అప్రజాస్వామ్యం, బీఆర్ఎస్ నాయకుల తెలివిలేని, చేతకాని చర్యలకు నిదర్శనమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేందర్, కార్తిక్‌రెడ్డి, నిసార్, డానియేల్, భరత్, సుమేర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి ఖో ఖో టీమ్ సెలక్షన్, టోర్నమెంట్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్, గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 68వ అండర్-17 బాలుర ఖోఖో పోటీలు శుక్రవారం గౌతమి మోడల్ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఖోఖో పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల నుంచి 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈపోటీల్లో రాష్ట్రస్థాయి ఖోఖో టీమ్‌ను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన ఖోఖో టీమ్ డిసెంబర్ మొదటి వారంలో అయోధ్యలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. మొదటగా హైదరాబాద్ వర్సెస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా టీమ్‌లు తలపడ్డాయి. ఈ క్రీడలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్‌లను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. క్రీడాకారులు, పీఈటీలకు గౌతమి పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, అనంతయ్య, మహిపాల్‌రెడ్డి, ధారాసింగ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరులో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే

తాండూరులో మినీస్టేడియం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఖోఖో స్టేట్ మీట్ టోర్నమెంట్ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తాండూరులో క్రీడా టోర్నమెంట్ ఏర్పాటు చేసే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు కృషిచేయాలని, తన వంతు సహకారం అందిస్తానన్నారు. మినీస్టేడియం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. దౌలాపూర్‌లో త్వరలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కానుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నగర శివారులో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని అన్నారు.

మెథడిస్టు జాతరలో పెరిగిన భక్తుల రద్దీ



ఏసుక్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ధారూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతరలో భక్తుల రద్దీ పెరిగింది. క్రైస్తవ భక్తులు శుక్రవారం జాతర ప్రాంగణానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. భక్తుల రద్దీ పెరగటంతో జాతర ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ప్రధాన వేదిక వద్ద ఉన్న ఏసుప్రభువు శిలువవద్ద క్రైస్తవ భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ముఖ ద్వారం సమీపంలో ఉన్న శిలువ వద్ద కూడా భక్తుల ప్రార్థనలు కొనసాగాయి. కాగా పాస్టర్ల ఏసుక్రీస్తు దైవ సందేశాలు, భజనలు, కీర్తనలు, పాటలతో జాతర ప్రాంగణం మారుమోగింది. ఉత్సవాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మతాల విశ్వాసాలను గౌరవిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతోందన్నారు.

నోవాటెల్ హోటల్‌లో దిల్ లూంనటి షో

- దల్జీత్ సింగ్ ఆటపాటలతో హుషారు
- వేలాది తరలివచ్చిన ప్రేక్షకులు
- భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు



ఎయిర్‌పోర్టు నోవాటెల్ ఏరీనాలో దిల్ లూంనటీ షోలో నృత్యాలు చేస్తున్న యువతి, యువకులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాపులర్ సింగర్ దల్జీత్ సింగ్ దిల్ లూంనటీ షో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్ ఏరీనాలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన ఈ షో ప్రముఖ సింగర్ దల్జీత్ సింగ్ ఆటపాటలతో యువతీయువకులు కేరింతలు కొట్టారు. దల్జీత్ సింగ్ సాంగ్స్‌కు యువత స్టెప్పులు చేశారు. ఈ షోకు దాదాపు 20 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారని నిర్వాహకులు పేర్కొన్నారు. వేలాది మంది ప్రేక్షకులు రావడంతో ఆర్‌జీఐఏ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసలే అంతర్జాతీయ విమానాశ్రయం కాబట్టి విమాన ప్రయాణికుల రాకపోకలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రతలు తీసుకున్నారు. ఈ షో మూడున్నర గంటల పాటు కొనసాగింది.

ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారుల నోటీసులు

ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న దిల్ లూంనటీ షోకు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు ఈవెంట్ నిర్వాహకులు వెల్లడించారు. వెల్ఫేర్ అధికారుల పర్మిషన్ లేకుండా షో నిర్వహిస్తున్నారని, భారీ డీజే సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయడంపై వారు మండిపడ్డారు. దిల్ లూంనటీ షోకు చిన్న పిల్లలను అనుమతించడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసి నోటీసులిచ్చినట్లు పేర్కొన్నారు.

కోట్ల శ్రీనివాస్‌కు ఘన సన్మానం



ఆమనగల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన కోట్ల శ్రీనివాస్‌కు శుక్రవారం మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శ్రీనివాస్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కోట్ల జగన్, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, నాయకులు గౌని నర్సింహగౌడ్, యాదయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

గురునానక్ బోధనలు అనుసరణీయం



గురునానక్ జయంతిలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, హన్మ

కడ్తాల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గురునానక్ బోధనలు, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విశ్వమానవాళి శ్రేయస్సు కోసం గురునానక్ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట శుక్రవారం సిక్కుల ఆరాధ్యదైవం, విశ్వగురువు గురునానక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువు సర్దార్ చరణ్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యనాయక్‌లతో కలిసి గురునానక్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సిక్కు గురువుల బోధనలు, గురునానక్ జీవన విధానం ప్రపంచానికి సన్మార్గాన్ని చూపించాయని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అన్ని మతాలను సమ దృష్టితో చూడాలని, సమాజ శ్రేయస్సుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు లక్‌పతి నాయక్, రామకృష్ణ, కిషన్, చందర్, రాందాస్, దేవేందర్‌సింగ్, సక్రుసింగ్, తులసీరామ్, హీరాసింగ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలి

చేవెళ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు నక్క రామగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే పనులు ముందుకు సాగడం లేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉండి ఉంటే పనులు ముందుకు సాగేవన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల చేతకాని తనం వల్లనే పనులు ముందుకు సాగకపోవడంతో నిత్యం ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు ప్రారంభించాలన్నారు. బి.భాస్కర్, సతీష్ తదితరులున్నారు.

శిథిలావస్థలో షాదీఖానా!

- రూ.50లక్షలతో భవన నిర్మాణం
- ఒకప్పుడు జోరుగా ఫంక్షన్లు.. ఇతర కార్యక్రమాలు
- నేడు పిచ్చిమొక్కలు పెరిగి అధ్వాన స్థితికి..

ఇబ్రహీంపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద ముస్లిం మైనారిటీ షాదీఖానా నిర్వహణలేక శిథిలావస్థకు చేరుకుంది. కాంపౌండ్‌లో ఏపుగా చెట్లు పెరిగి చెత్తా చెదారంతో కనీసం కాలు పెట్ట లేకుండా ఉంది. 2003లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో సుమారు రూ.50 లక్షలు వెచ్చించి నిర్మాణం చేశారు. మొదట్లో షాదీఖానాలో పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు, చిన్న చిన్న దావత్‌లు బాగా జరిగేవి. ముస్లింలే గాకుండా ఇతర వర్గాలు కూడా నిర్వహణకోసం చిన్న మొత్తంలో చెల్లించి ఇందులో ఫంక్షన్లు చేసుకునేవారు. అయితే, రాను రాను దీని నిర్వహణను పూర్తిగా మరిచిపోయారు. అటువైపు కనీసం కన్నెత్తి చూడలేకపోతున్నారు. దాంతో పరిసరాల్లో చెట్లు ఏపుగా పెరిగి భవనం పూర్తిగా దుమ్ము కొట్టుకుపోయింది. అధికార యంత్రాంగం కూడా దీన్ని మరిచిపోయినట్లుంది. ఈ షాదీఖానాకు పైనే ఇబ్రహీంపట్నం పాషా దర్గా ఉంది. అందరికీ అందుబాటులో మంచి వాతావరణంలో ఉన్న భవనానిన మున్సిపాలిటీ నిర్వహణలోకి తెస్తే పేద, మధ్య తరగతి వర్గాలు తిరిగి వివిధ రకాల ఫంక్షన్లు జరుపుకునే అవకాశం ఉంటుంది.

భవనాన్ని నిర్వహణలోకి తేవాలి



లక్షలు వెచ్చించి అప్పట్లోనే షాదీఖానాను చక్కగా నిర్మించారు. పేద, మధ్య తరగతి వాళ్ల పెళ్లిళ్లు, ఫంక్షన్లు జరుపుకోవడానికి అనుకూలంగా ఉండేది. భవనాన్ని తిరిగి నిర్వహణలోకి తెస్తే బయట ఫంక్షన్ హాళ్లకు పెద్ద మొత్తంలో చెల్లించుకోలేని వారికి ప్రయోజనంగా ఉంటుంది.

- ఎండీ గౌస్, ఇబ్రహీంపట్నం


చెరువుకట్ట కింద నిరుపయోగంగా ఉన్న ముస్లిం మైనారిటీ షాదీఖానా

అటెండర్లే దిక్కు


శిథిలావస్థకు చేరుకున్న మొయినాబాద్ గ్రంథాలయం

(5వ పేజీ తరువాయి)

చూస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, అటెండర్లకు ప్రతీనెల అందించే జీతం కూడా అందడం లేదని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయం గుప్పిట్లో పాఠకులు

జిల్లాలోని ప్రతీ మండలంలో ఒక గ్రంథాలయం నిర్మించారు. తర్వాత వాటి బాగోగులు పట్టించుకునేవారు లేకుండా పోయారు. దీంతో చేవెళ్ల, మొయినాబాద్ మండల కేంద్రంలోని గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం లైబ్రరీకి వచ్చే పాఠకులు భయాందోళనకు గురవుతున్నారు. చేవెళ్లలో గ్రంథాలయ భవన నిర్మాణానికి 2023 ఆగస్టు 23న అప్పటి సంస్థ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.1.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ.. ఇంతవరకు నిర్మాణ పనులు ప్రారంభించ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. చేవెళ్లలో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. అలాగే మొయినాబాద్ మండలంలో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ గ్రంథపాలకుడు రిటైర్డ్ కావడంతో అటెండరే లైబ్రరీ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నాడు. వనస్థలిపురంలో కొత్త గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1.95కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. షాబాద్ మండల కేంద్రంలో రూ.80 లక్షలతో కొత్తగా గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. అలాగే కొత్తూరులో రూ.75 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించారు. అయితే ఈ భవనాల్లో ఫర్నిచర్ ఏర్పాటు చేయలేదు. డిస్ట్రిక్ లెవల్ పర్చేసింగ్ కమిటీ వద్ద ఫైల్ ఆగి ఉంది. షాబాద్, కొత్తూరులో కొత్తగా నిర్మించిన గ్రంథాలయాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఫర్నిచర్ లేకపోవడంతో వాటిని ప్రారంభించలేదని సమాచారం. ఇకపోతే శేరిలింగంపల్లిలో గ్రంథాలయ నిర్మాణానికి రూ.2.95 కోట్లు మంజూరయ్యాయి. కానీ, పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కొందుర్గు మండలంలో పశువైద్యశాల భవనంలోనే ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతోంది.

కొత్త మండలాల్లో లైబ్రరీలు కరువు

2016లో జిల్లాల పునర్విభజన జరిగింది. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 10 మండలాలు రంగారెడ్డి జిల్లాలోకి వచ్చాయి. తర్వాత కొన్ని కొత్త మండలాలు ఏర్పడ్డాయి. అయితే, ఈ కొత్త మండలాల్లో ఇప్పటివరకు గ్రంథాలయాలు ఏర్పాటు చేయలేదు. చౌదరిగడూడ, నందిగామ, అబ్దుల్లాపూర్‌మెట్, కడ్తాల్ మండలాల్లో కూడా లైబ్రరీలు లేవు.

పెంచిన సమయం.. కల్పించిన భోజన వసతి

గ్రూప్-2, గ్రూప్-3 కోసం సిద్ధమతుతున్న అభ్యర్థుల అభ్యర్థన మేరకు జిల్లా కేంద్ర గ్రంథాలయం నిర్వహణ సమయాన్ని పొడిగించారు. రాత్రి సమయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెరిచి ఉంటుంది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్ సొంత ఖర్చులతో అభ్యర్థులకు 45 రోజుల పాటు భోజన వసతి కల్పిస్తున్నారు. జిల్లాలోని సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, ఆమగల్లు, శంకర్‌పల్లి, మొయినాబాద్ గ్రంథాలయంలో గ్రూప్-1, 2 అభ్యర్థులకు పుస్తకాలు అందుటుబాటులో ఉంచారు. కాగా, మిగతాచోట్ల కూడా లేవు.

మా మండలంలో గ్రంథాలయమే లేదు



2016లో చౌదరిగూడ కొత్త మండలంగా ఏర్పడింది. ఇప్పటివరకు గ్రంథాలయం ఏర్పాటు చేయలేదు. ఇక్కడ లైబ్రరీ లేకపోవడంతో పక్క మండలం కొందుర్గు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. పోటీ పరీక్షలకు కావాల్సి పుస్తకాలను అభ్యర్థులు ఇతర మండలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

- అఫ్రోస్ అలీ, చౌదరిగూడ

మహిళలతోనే దేశ ప్రగతి సాధ్యం



కొత్తూర్ : విరాళం అందజేస్తున్న ఎస్‌బీ పల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్

షాద్‌నగర్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) మహిళల ఆర్థిక ప్రగతితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణ శివారులోని ఎఫ్‌సీఎన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 130మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు థామస్, గీత కుట్టు మెషీన్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, యాదయ్య, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

కేశంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకులలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఛైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, డైరెక్టర్లు అంజిరెడ్డి, మధుసూదన్‌గౌడ్, మఠం చంద్రశేఖర్, సీఈవో అనీల్‌కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యాదయ్య యాదవ్, జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, భాస్కర్‌గౌడ్, తదితరులున్నారు.

జూనియర్ కళాశాల భవనానికి భూరి విరాళం

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారంతో నిర్మాణ పనులు ప్రారంభించిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాకి కొత్తూర్ మండలంలోని స్వస్తిక్ మిర్చి పరిశ్రమ యజమాని విజయ్‌కుమార్ షా రూ.25లక్షలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం పరిశ్రమ తరఫున కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి రూ.25లక్షల చెక్కును ఎమ్మెల్యే శంకర్‌కు అందజేశారు. అలాగే కొత్తూర్ మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి మాజీ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అంబటి ప్రభాకర్ తనవంతుగా రూ.5లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే శంకర్‌కు అందించారు. ఇన్ముల్‌నర్వకు చెందిన ఆగీర్ శేఖర్‌గుప్తా రూ.లక్షా11వేలు ఎమ్మెల్యేకు అందించారు. ప్రభాకర్, శేఖర్‌గుప్తలను ఎమ్మెల్యే అభినందించి సన్మానం చేశారు.

క్రైం కార్నర్

తల్లి సంవత్సరీకానికి వెళ్తున్నానని చెప్పి
కానరాని లోకాలకు..

- అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
- ఫిట్స్ రావడంతోనే మృతిచెందినట్లు పోలీసుల అనుమానం


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

శంకర్‌పల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): తల్లి సంవత్సరీకం కోసమని వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లికి చెందిన శేఖర్(40) కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. శేఖర్ తండ్రి బాలరాజు 12 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వెళ్లగా.. తల్లి లక్ష్మి రెండేళ్లక్రితం మరణించింది. శేఖర్‌కు అన్న ఆంజనేయులు, అక్క కల్పన ఉన్నారు. ఆంజనేయులు మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కార్పెంటర్‌గా దుకాణం నడుపుతుండగా, శేఖర్ అక్కడే దుకాణంలో పనిచేస్తుండేవాడు. ఈక్రమంలో తల్లి సంవత్సరీకం ఉందని ఆంజనేయులుతో చెప్పి నాలుగు రోజుల క్రితం అక్కడి నుంచి బయలుదేరి పటాన్‌చెరువులో ఉండే అక్క కల్పన వద్దకు శేఖర్ వచ్చాడు. మూడు రోజుల క్రితం పటాన్‌చెరువు నుంచి బయలుదేరి మునిదేవునిపల్లికి వెళ్లకుండా శంకర్‌పల్లికి వచ్చాడు. అయితే, శంకర్‌పల్లికి ఎందుకు వచ్చాడనేది తెలియదు. శుక్రవారం శంకర్‌పల్లిలో శవమై కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా.. వారు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. మద్యం సేవించి, బహిరంగ మలవిసర్జన చేస్తుండగా ఫిట్స్ వచ్చి మృతిచెందినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. తలకు చిన్నపాటి గాయం కావడంతో చెట్లకు తల తగలడంతో అయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలం వద్ద దొరికిన ఫోన్ ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రోడ్డు పక్కన మృతిచెంది కనిపించినట్లు తెలిపారు. అతడి పక్కన ఏపీ 39 సీఏ 8096 నెంబరు గల పల్సర్ బైక్ కిందపడి ఉందని తెలిపారు. మృతుడి శరీరంపై బ్లాక్ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం : కసిరెడ్డి

కడ్తాల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతోనే దైవానుగ్రహం కలుగుతుందని, దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, భక్తులకు సదుపాయాల కల్పన, దైవ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. మైసిగండిలోని పురేంద్రపురి కాలనీలో నూతనంగా నిర్మించే శివాలయం, దత్తాత్రేయ స్వామి ఆలయాల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి-మాధవి దంపతులు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, భగవాన్ ఫౌండేషన్ ఛైర్మన్ దూద్యనాయక్‌లతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళం అందజేశారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పూజలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తెల్లవారుజాము నుంచే దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా శైవ క్షేత్రాల్లో పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలు, మామిడితోరణాలతో అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


చేవెళ్ల : శివాలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ఇబ్రహీంపట్నం : పెద్ద చెరువు వద్ద గంగ హారతి ఇస్తున్న హరిహర అఖండ క్షేత్ర సమితి సభ్యులు


తలకొండపల్లి : మల్లప్ప గుట్టపై సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు



కేశంపేట/శంషాబాద్ : శివాలయం, సిద్దులగుట్టలో పూజల్లో భక్తులు

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. చల్లంపల్లి గ్రామంలో శుక్రవారం జైపాల్ యాదవ్ పర్యటించారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జైపాల్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ గుర్కా కృష్ణయ్యయాదవ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప పూజ


భిక్షలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఆమనగల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండపై గల శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి అభిషేకం, పూజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పోలోజు శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో మాలదారులు, భక్తులు పాల్గొన్నారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. గురుస్వాములు కృష్ణ, అశోక్, నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, గిరిబాబు, గోపి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన చిన్నారెడ్డి


సీఎం రేవంత్‌తో కాయితి చిన్నారెడ్డి

ఆమనగల్లు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాయితి చిన్నారెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి రేవంత్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈనెల 20న జరిగే తన కుమారుడు శరత్‌రెడ్డి వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేసినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తోడ్పాటునందించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. రూపం వెంకట్‌రెడ్డి, గోలి కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

ఇంటి నిర్మాణానికి ఉప్పల చేయూత

తలకొండపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లింగరావుపల్లికి చెందిన బోయిని శేఖర్ ఇంటి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి మెటీరియల్ సమకూర్చగా శుక్రవారం సభ్యులు, నాయకులు అందజేశారు.

పశు వైద్యశిబిరం విజయవంతం

కడ్తాల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా దూడలకు నులిపురుగు నివారణ చికిత్సలు అందించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కేశంపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త డోల లక్ష్మయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడు నిరుపేద కావడంతో పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్ రూ.2వేలు, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి రూ. 5వేలు, పల్లె ఆనంద్‌కుమార్ రూ. 5వేలు, గ్రామ మాజీ సర్పంచ్ కె. మంజుల మల్లేష్ రూ. 5వేలు, వన్నాడా మనోహర్ గౌడ్ రూ. 2వేలు, మాజీ సైనికుడు ఆనంద్ రెడ్డి వెయ్యి రూపాయలు మృతుడు డోల లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు అందించారు. కాంగ్రెస్ పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు.

సమగ్ర సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలి

యాచారం/ఆమనగల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు ఇంటి యజమానులతో మాట్లాడడంతో పాటు ఆధార్‌కార్డుల నెంబర్లు సరిగ్గా నమోదు చేయాలని, పత్రాలపై తప్పులు లేకుండా జాగ్రత్త పడాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో ఆయన సర్వేను పరిశీలించారు. సర్వే పత్రాలు లేకపోతే తక్షణమే తనకు లేదా ఎంపీవోలకు సమాచారమందించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో 4వేల పత్రాలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రజలు కూడా ఎన్యుమరేటర్లకు సహకరించి సరైన సమాచారమందించాలని కోరారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షణాధికారి శైలజ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు మున్సిపాలిటీలో కులగణన సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన నివాసాల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సర్వే తీరును మున్సిపల్ కమిషనర్ వసంత పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వే సమగ్రంగా పక్కాగా చేపట్టాలని సూచించారు. ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాలలో ఎంపీడీవో మాధురి సర్వేను పరిశీలించారు.


యాచారం : సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

వృత్తి ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించాలి


శ్రీరాములు, జంగయ్యలను సన్మానిస్తున్న దశరథ్

కడ్తాల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు వృత్తి ధర్మాన్ని అంకిత భావంతో నిర్వర్తించి సమాజంలో ఆదర్శంగా నిలువాలని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ కోరారు. పని తీరు ఆధారంగానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రానికిచెందిన గోరటి జంగయ్య, అన్మాస్‌పల్లి కి చెందిన సిల్వేరు శ్రీరాములు ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం కడ్తాలలో వారికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూల మాలలు, శాలువాలతో దశరథ్ నాయక్ వారిని సత్కరించి అభినందించారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, నాయకులు లక్ష్మణాచారి, వెంకటేశ్, కర్ణాకర్, రాజు, శ్రీనివాస్, అంజి, మోతిలాల్, పాండు నాయక్, బీక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 15వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్బుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీ తండాలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిలు మండల కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. దీక్షలో జేఏసీ ఛైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ శరత్‌చంద్ర, గ్రామ నాయకులు పాల్గొన్నారు.